క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా బంద్

అరకులోయటౌన్: స్థానిక విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎ.వి.ఎస్.ఎం. అప్పారావు ఓప్రకటనలో తెలిపారు. మరమ్మతుల పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. అరకు(అంజోడ), సుంకరమెట్ట, హట్టగుడ ఫీడర్ పరిధిలోని పెదలబుడు, చినలబుడు, చొంపి, సుంకరమెట్ట, శిరగాం,లోతేరు,మాడగడ, మాదల, బస్కీ, బొండాం,గన్నెల,ఇరగాయి,పద్మాపురం,కొత్తభల్లుగుడ, డుంబ్రిగుడ మండలం అరకు సంతబయలు పంచాయతీ పరిధిలోనిగ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

షోకాజ్ నోటీసుల జారీ దుర్మార్గం

రంపచోడవరం: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు ఎంఎల్‌హెచ్‌పీలు నిరసనలో పాల్గొంటే డీఎంహెచ్‌వో జమాల్‌బాషా వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని సీఐటీయూ అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. తక్షణమే షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీహెచ్‌సీకి పెరిగిన రోగుల తాకిడి



ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో రోగులు

ముంచంగిపుట్టు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రోజురోజుకు రోగుల తాకిడి పెరుగుతోంది. జోరుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని, జ్వరం, దగ్గు,జలుబుతో గిరిజనులు సీహెచ్‌సీకి వస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఓపీ 164గా నమోదు అయింది. గత వారం రోజుల్లో 1123 మంది సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందారు. వైద్యాధికారులు గీతాంజలి, సంతోష్, ధరణి వైద్య సేవలందించారు. గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తుండడంతో కిలగాడ,లబ్బూరు,రూడకోట పీహెచ్‌సీల సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నారు.

పాఠశాలలు, వసతి గృహాల్లో తనిఖీలు



అడ్డతీగల బాలుర ఉన్నత పాఠశాలలో పరిశీలిస్తున్న అధికారులు

అడ్డతీగల : మండలంలో పలు పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమపాఠశాలలను మండల అధికారుల బృందం తనిఖీ చేసింది. కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఎంపీడీవో రంగారావు, ఎంఈవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ తేజస్విని, ఎస్ఐ అప్పలరాజు, ఐసీడీఎస్ అధికారుల బృందం మండలంలో విస్తృతంగా పర్యటించింది. దీనిలో భాగంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను అధికారులు పరిశీలించారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం



వై.కంఠవరంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ వై.కంఠవరంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పూర్తిగా పాడైపోవడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో ముందుజాగ్రత్తగా పిల్లలను పాఠశాలకు పంపడం లేదని వారు తెలిపారు. ఈ పాఠశాలలో 30 మంది విద్యార్థులు చదుతున్నారని వారు చెప్పారు. పాఠశాల భవనంపై అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందించినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరారు.

రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎమ్మెల్యే

అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

డుంబ్రిగుడ: సబ్సిడీపై అందజేస్తున్న రాజ్‌మా విత్తనాలను ప్రతి గిరిజన రైతు సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ అధికారి నీలవేణి ఆధ్వర్యంలో మంగళవారం రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విత్తనాలతో పాటు అర కిలో విత్తనశుద్ధి మందును అందజేస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని అనంతగిరి మండలంలో 213 క్వింటాళ్లు, అరకులోయలో 400 క్వింటాళ్లు, డుంబ్రిగుడలో 323 క్వింటాళ్లు, హుకుంపేట మండలంలో 276 క్వింటాళ్ల విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో డుంబ్రిగుడ, అరకులోయ జెడ్పీటీసీలు చటారి జానకమ్మ, శెట్టి రోషణి, ఎంపీపీ బాకా ఈశ్వరి, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్‌రావు, లలిత, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు హరి, స్థానిక సర్పంచ్ వెంకటరావు, వ్యావసాయ శాఖ ఏడీ మోహన్‌రావు, హుకుంపేట, అరకులోయ వ్యవసాయశాఖ అధికారులు ఎం.లీలావలతి, పాణిరాజ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమీపంలో ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులతో ఆంగ్ల పాఠాలు చదివించారు. అనంతరం మెనూను తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్‌ను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అరకులోయ నియోజకవర్గం వైఎస్సార్ సోషల్ మీడియా కన్వీనర్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి

చింతూరు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చింతూరు ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహాల నిర్మూలన మండలస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ దీని కోసం గ్రామస్థాయిలో ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, మతపెద్దలు, గ్రామస్తులతో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. 11 నుంచి 18 ఏళ్లలోపు కిశోర బాలికల జాబితా తయారుచేసి వారిలో ఎంతమంది బడి మానేసిన వారు ఉన్నారనేది గుర్తించాలని తెలిపారు. గ్రామస్థాయిలో జరిగే అన్ని వివాహాలను తప్పనిసరిగా సచివాలయంలో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవిబాబు, మసీదు ఇమాం ఎజాజ్ అహ్మద్, జనకళ్యాణ్ స్వచ్ఛందసంస్థ కో ఆర్డినేటర్ గణేష్, సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డి.సంపలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు



డి.సంపల రహదారిని పరిశీలిస్తున్న ఎంపీడీవో సాయినవీన్

పాడేరు: మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ మారుమూల డి.సంపల గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సాయినవీన్ తెలిపారు. మంగళవారం ఆయన కాలినడకన వెళ్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, తాగునీటి ట్యాంక్, గృహ నిర్మాణాలను పరిశీలించారు. గ్రామం నుంచి మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు పక్కా రహదారి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలపడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు గుల్లెలి లింగమూర్తి, గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉన్నారు.

బొండగుడలో పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలి

వైస్ ఎంపీపీ కిల్లో రామన్న



గ్రామస్తులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రామన్న

అరకులోయ రూరల్: మండలంలో బస్కి పంచాయతీ బొండగుడ పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలని వైస్ ఎంపీపీ కిల్లో రామన్న డిమాండ్ చేశారు. పంచాయతీ నాయకులతో కలిసి మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్వశిక్ష అభియాన్ నిధులు సుమారు రూ.10 లక్షలతో పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభించి, సొమ్ము స్వాహా చేశారన్నారు. దీంతో గ్రామస్తులు నిర్మించిన తాత్కాలిక రేకుల షెడ్‌లోనే తరగతులు నిర్వహిస్తున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ



కూనవరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

కూనవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమలను నివారించవచ్చని కూనవరం , కూటూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు సునీల్ కుమార్, శ్రీనివాసరావు దొర తెలిపారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, విద్యార్థులతో ర్యాలీ, పాత బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వ లేకుండా చూడాలని, ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్య వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరలు ఉపయోగించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రాజీవ్, సూపర్‌వైజర్ డి.శ్రీనివాస్, వెంకటేష్, రత్నం, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తొలగింపు



కాలువల్లో పూడిక తీయిస్తున్న సర్పంచ్ కృష్ణవంశీ, వైస్ ఎంపీపీ ఆనంద్

గూడెంకొత్తవీధి: పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెదవలస పంచాయతీ సర్పంచ్ కృష్ణవంశీ అన్నారు.పెదవలసలో వైస్ ఎంపీపీ ఆనంద్‌తో కలసి ఆయన మంగళవారం పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో మురుగు కాలువల్లో పూడిక తీయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని స్థానికులకు సూచించారు.పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి రైతు పంటల నమోదు చేసుకోవాలి

దేవరాపల్లి: ప్రతీ రైతు పంటల నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని తహసీల్దార్ ఎం. లక్ష్మి, మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ సూచించారు. ముషిడిపల్లి, ఎ.కొత్తపల్లి, కె.ఎం.పాలెం గ్రామాల్లో మంగళవారం వారు పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఆర్వో, అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్ కలిసి టీమ్‌గా పారదర్శకంగా పంటల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం సాగు చేస్తున్న వారు పేరిట మాత్రమే పంటల నమోదు చేయాలన్నారు.

యాజమాన్య పద్ధతులతో మంచి ఫలితాలు



వేరుశెనగ సాగు గురించి రైతులకు వివరిస్తున్న మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

చింతపల్లి: రైతులు వేరుశెనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని చింతపల్లి మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా మంగళవారం తాజంగి పంచాయతీ రేగుబయలులో రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి ఫసల్‌బీమా, ఈపంట నమోదు వంటి పథకాల గురించి వివరించారు.

చింతపల్లి ఎంపీడీవోగా ఆశాజ్యోతి



చింతపల్లి: చింతపల్లి ఎంపీడీవోగా ఆశాజ్యోతి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీవోగా వీరసాయిబాబా పనిచేశారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో ఆశాజ్యోతిని పెద్దాపురం బదిలీ చేశారు. అక్కడ ఎంపీడీవో వీరసాయిబాబును చింతపల్లికి బదిలీ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ శాఖల బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో వీరిరువురూ వారి వారి పూర్వ స్థానాల్లోచేరారు.

కొయ్యూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా మేరీరోజ్

కొయ్యూరు: కొయ్యూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా మేరీరోజ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.అనంతగిరి నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఎంపీడీవో లాలం సీతయ్య తిరిగి అనంతగిరి వెళ్లారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన మేరీరోజ్ విధి నిర్వహణలో జాప్యం చేస్తున్నారన్న కారణంతో ఆ బాధ్యతల నుంచి కలెక్టర్ తప్పించారు. అనంతగిరి ఈవోఆర్‌డీగా పనిచేసిన లాలం సీతయ్యకు కొయ్యూరు ఎంపీడీవో బాధ్యతలు అప్పగించారు. సీతయ్య అనంతగిరి వెళ్లడంతో మేరీరోజ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

వచ్చేనెల 15లోగా ఈ-పంట నమోదు



రైతులతో మాట్లాడుతున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు: వచ్చేనెల 15వ తేదీ లోగా రైతులు విధిగా ఈ పంటలో నమోదు చేసుకోవాలని ఏవో ఉమాదేవి తెలిపారు. చింతలపూడి,కొయ్యూరు, చీడిపాలెంలలో వేసిన వరి పంటను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పంటలో నమోదైన పంటలను మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు మండలంలో 90 శాతం వరినాట్లు పూర్తయినట్టు చెప్పారు.

అంగన్‌వాడీల్లో కిచెన్ గార్డెన్లు నిర్వహించాలి



లొద్దిపాకల కిచెన్ గార్డెన్ వద్ద సీడీపీవో విజయ కుమారి

కొయ్యూరు: ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సీడీపీవో విజయ కుమారి అన్నారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటుతో పిల్లలకు పౌష్టికాహారం అందజేయవచ్చని ఆమె చెప్పారు. చింతలపూడి, లొద్దిపాకలు, సింగరాలపాడు, గింజర్తిలలో అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించి రికార్డులను, కిచెన్ గార్డెన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రకాల ఆకు కూరలను పెంచడం ద్వారా పోషకాలు కలిగిన ఆహారాన్ని పిల్లలు, గర్భిణులు,బాలింతలకు అందించవచ్చన్నారు. పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు.

బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న డాగ్ స్క్వాడ్

కూనవరం: అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆదేశాల మేరకు మండలంలో మంగళవారం బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త వ్యక్తులు సంచరించినా, అనుమానాస్పదంగా వస్తువులు కంటపడినా పోలీసులకు తెలియజేయాలని కోరారు.

విద్యార్థులకు మిఠాయిల పంపిణీ

మాకవరపాలెం: శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా బూరుగుపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఇక్కడి విద్యార్థులకు ఉపాధ్యాయిని సర్వలక్ష్మి, మాకవరపాలెం ప్రాథమిక పాఠశాల-2లో పూర్వ విద్యార్థి గెంజి ముత్యాలు వీటిని అందజేశారు. మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి దాతల నుంచి స్పందన వస్తోందని ఎంఈవో-2 మూర్తి తెలిపారు.

ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పాడేరు : వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, హైదరాబాద్ గ్రేస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పాడేరు జిల్లా ఆస్పత్రి మాతా, శిశు విభాగం వద్ద 44 మందికి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 21 మందికి మమోగ్రఫీ పరీక్షలు, మిగిలిన వారికి పాప్ స్మియర్, ఎక్స్‌రే, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై రోగులను పరీక్షించారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్ జయమమ్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు గత కొన్నాళ్లుగా ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయడం సంతోషించదగ్గ విషయమని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సృజన, డాక్టర్ మణికంఠ, డాక్టర్ గౌతం, వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, గ్రేస్‌క్యాన్సర్‌ఫౌండేషన్‌ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనచేతుల్లోనే..



మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ విజయభారతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు, ఏపీవో మూర్తి

చింతపల్లి: పర్యావరణ పరిరక్షణ మన చేతుల్లోనే ఉందని చింతపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి అన్నారు. కళాశాల ఆవరణలో 600 మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఉపాధి పథకం ద్వారా మొక్కలు పంపిణీ చేసిన ఏపీవో మూర్తిని ఈసందర్భంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు లీలాపావని, రవీంద్రనాయక్, ఈశ్వరరావు, జగత్‌రాయ్, శివరాంకుమార్, శ్రీనివాసరాజు, రవీంద్రబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



బొడ్డుమామిడిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని గెమ్మలి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది సూచించారు. గడుతూరు పంచాయతీలోని బొడ్డమామిడి, జోడుమామిడి, బొందులపనుకు, సీతబంద, వసమామిడి గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తితే తక్షణమే ఆస్పత్రులకు వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమ తెరలు వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్‌లు గురుమూర్తి, పెద్దబ్బాయి,లక్ష్మణరావు, రాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థితో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్



రెల్లలపాలెంలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నూకరాజు

కొయ్యూరు: అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలో విషాహారం తిని మృతి చెందిన ముగ్గురు విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎంపీపీ బడుగు రమేష్ డిమాండ్ చేశారు. ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురై నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థులను ఆయన మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమతి లేని సంస్థలు, అనాథ ఆశ్రమాలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఫుడ్‌పాయిజన్ కారణంగా మరణించిన గెమ్మలి భవానీ కుటుంబాన్ని జెడ్పీటీసీ వారా నూకరాజు పరామర్శించారు. మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి

అరకులోయ రూరల్: అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలో విషాహారం తిని మృతి చెందిన ముగ్గురు విద్యార్థుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మాన పడాల్, ప్రధాన కార్యదర్శి బాలదేవ్ కోరారు. వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



బాకుబెడలో పశువులకు టీకాలు చేస్తున్న పశువైద్యాధికారి సౌజన్యదేవి



జి.ఎం.కొత్తూరులో టీకాలు వేస్తున్న వైద్యాధికారులు సృజనకుమారి, కుసుమ ప్రియదర్శిని

ముంచంగిపుట్టు: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని కిలగాడ పశు వైద్యాధికారి ఎం.సౌజన్యదేవి అన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలో బంగారుమెట్ట, బాకుబెడ, తలబిరడ, కుంబిగూడ, కర్రిముఖిపుట్టు గ్రామాల్లో మంగళవారం 319 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆవులు,ఎద్దులు,మేకలు సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడతూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం వచ్చే నెల 18 వరకు జరుగుతుందన్నారు. పశువులు,గొర్రెలు,మేకలు అనారోగ్యానికి గురైతే వెంటనే తమకు సమాచారం అందించాలని ఆమె తెలిపారు.

జి.మాడుగుల: రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి ఎస్.పి.సృజన కుమారి, బంధవీటి పశువైద్యాధికారి కుసుమ ప్రియదర్శిని తెలిపారు.

జి.మాడుగుల పంచాయతీ జి.ఎం. కొత్తూరులో పశువులకు మంగళవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. జి.ఎం కొత్తూరులో 245 ఆవులు, వైబీ గొందూరులో 132 ఆవులకు టీకాలు వేసినట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్ఏలు కొండబాబు, రఘునాథ్, వెంకట్, శ్యామ్‌ప్రసాద్, ఓఎస్ మత్స్యలింగం తదితరులు పాల్గొన్నారు.